


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం






## బస్సు ప్రమాదంలో క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పిస్తాం

భానుపురి/కోదాడ




సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట శివారులో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మరో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ఫ్రెష్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, ఐరన్ లోడ్‌తో వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కే. నరసింహ కలిసి ప్రమాద స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను స్థానికులను, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదం జరగడం అత్యంత బాధాకరమని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కోదాడ ఆసుపత్రికి, తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు, వారి కుటుంబ సభ్యులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సంఘటన ప్రాంతంలో స్థానిక పోలీస్ అధికారులు, రెవెన్యూ , వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అత్యాధునిక సాంకేతికతతో క్యాన్సర్ వ్యాధికి చికిత్స

-యశోద హాస్పిటల్ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ సుమంత్ కుమార్

భానుపురి /సూర్యాపేట టౌన్




క్యాన్సర్ వ్యాధి చికిత్సకు ప్రస్తుతం అనేక ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి రోగికి ఒకే రకమైన చికిత్స విధానం సరిపోదని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి క్యాన్సర్, రక్త సంబంధిత వ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ సుమంత్ కుమార్ మల్లుభట్టు తెలిపారు.బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ప్రతి రోగి ఆరోగ్య పరిస్థితి, క్యాన్సర్ రకం, వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స విధానాన్ని నిర్ణయిస్తామని తెలిపారు.క్యాన్సర్‌ను పూర్తిగా నియంత్రించడం లేదా తగ్గించడం, రోగి జీవన నాణ్యతను మెరుగుపరచడం, చికిత్స వల్ల కలిగే దుష్ప్రభావాలను సాధ్యమైనంత వరకు తగ్గించడం ఆధునిక క్యాన్సర్ చికిత్స ప్రధాన లక్ష్యాలని వివరించారు.ఆధునిక సాంకేతికతతో చికిత్సలో దుష్ప్రభావాలను తగ్గించడంతో పాటు చికిత్స ప్రభావాన్ని కొనసాగించవచ్చని తెలిపారు.ప్రస్తుతం ఆసుపత్రుల్లో అత్యాధునిక వికిరణ చికిత్స సాంకేతికతతో కూడిన హైపర్‌సైట్ యంత్రాన్ని వినియోగిస్తున్నట్లు చెప్పారు.ఈ విధానంలో క్యాన్సర్ ప్రభావిత ప్రాంతాన్ని అత్యంత కచ్చితత్వంతో గుర్తించి అక్కడికే చికిత్స అందించడం ద్వారా చుట్టుపక్కల ఉన్న ఆరోగ్యకరమైన కణజాలానికి కలిగే నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.చికిత్సను అత్యంత కచ్చితత్వంతో నిర్వహించడం ఈ సాంకేతికత ప్రత్యేకత అని పేర్కొన్నారు. ప్రతి నెల రెండో, నాలుగోవ బుధవారాల్లో సూర్యాపేటలోని కనెక్ట్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో రోగులకు వైద్య సలహాలు అందుబాటులో ఉంటాయని డాక్టర్ సుమంత్ కుమార్ తెలిపారు.ఈ సమావేశంలో యశోద ఆసుపత్రి సికింద్రాబాద్ మేనేజర్ కర్నే సుదర్శన్ రెడ్డి, మార్కెటింగ్ బృందం మేనేజర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ఇంటీరియర్ మెటీరియల్స్ ను వినియోగదారులకు అందించాలి






-రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్

భానుపురి /సూర్యాపేట టౌన్

నాణ్యమైన ఇంటీరియర్ మెటీరియల్స్ ను వినియోగదారులకు అందించి వారి మన్ననలను పొందాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని త్రివేణి గార్డెన్ ఫంక్షన్ హాల్ వద్ద నిర్వాహకులు దేవిలాల్ సుతార్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన హోం ఇంటీరియర్ మాడ్యులర్ ఫ్యాక్టరీ ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గృహాలు, కార్యాలయాలు, వ్యాపార దుకాణాలకు, ఉపయోగపడే మెటీరియల్ ను పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్వాహకులు మాట్లాడుతూ తమ వద్ద నాణ్యమైన ఇంటీరియర్ మెటీరియల్ అందుబాటులో ఉన్నాయని పట్టణ ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో రంగరాజు రుక్మారావు, ఏఎస్ఐ శంకర్, అయిటిపాముల శ్రీనివాస్, చిత్తలూరి యాదగిరి గౌడ్, మన్సూర్, కమలేష్, అశోక్, ఉప్పల సతీష్, పరుశరాములు, తదితరులు పాల్గొన్నారు.



## కలశ స్థాపనతో ప్రారంభమైన సంతోషిమాత జన్మదిన వేడుకలు



భానుపురి/సూర్యాపేట కల్చరల్

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషి మాత దేవాలయంలో త్రయాహ్నికంగా నిర్వహిస్తున్న జన్మదిన వేడుకల్లో భాగంగా మొదటి రోజు బుదవారం కలశ స్థాపనతో పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పూజా మండపంపై గణపతి పూజ పుణ్యాహవాచనం, మంటపరాధన, కంకణ ధారణ, దీక్ష వస్త్రధారణ నిర్వహించారు. ప్రత్యేకంగా జన్మదిన వేడుకల సందర్భంగా రుద్రహోమం, లలిత హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతోషి మాత దేవాలయ అధ్యక్ష లు బ్రాహ్మ0డ్లపల్లి మురళీధర్, ప్రధాన కార్యదర్శి పబ్బ ప్రకాష్ కోశాధికారి కొత్త మల్లికార్జున్, దేవాలయ సహాయ అర్చకులు అశోక్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి

భానుపురి /సూర్యాపేట కల్చరల్



అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయం 5వ వార్షికోత్సవం సందర్భంగా కొప్పుల వేణారెడ్డి వారి సతీమణి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి కృపతో ప్రజలందరికీ శాంతి, సంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు. దేవాలయాల్లో నిర్వహించే పూజలు, వార్షికోత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.అమ్మవారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, మార్కెట్ కమిటీ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, జిల్లా కాంగ్రెస్ నాయకులు నర్సింగ్ మహేష్, శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయ అధ్యక్షుడు ఉప్పల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మిర్యాల కొండలరావు, కోశాధికారి ముప్పారపు బాబురావు, ఉపాధ్యక్షులు పివి సాగర్, చర్ల సత్యనారాయణ కందిమల్ల సత్యనారాయణ, అర్షకులు చంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేంతవరకు మా మద్దతు

-బీసీ ఉద్యమ నాయకులు వట్టే జానయ్య యాదవ్

భానుపురి /సూర్యాపేట టౌన్



సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేంతవరకు తమ పూర్తి మద్దతు ఉంటుందని బీసీ ఉద్యమ నాయకులు వట్టే జానయ్య యాదవ్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రైతు బజార్ వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించాలనే డిమాండ్‌తో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని సూర్యాపేట మీదుగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వస్తే జిల్లాలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వ్యాపార, పారిశ్రామిక, విద్యా రంగాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించేందుకు చేపడుతున్న ఉద్యమానికి బీసీ సంఘం తరఫున అండగా ఉంటామని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వచ్చేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేంతవరకు ఉద్యమానికి తమ మద్దతు కొనసాగుతుందని తెలిపారు.మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సైతం బుల్లెట్ ట్రైన్ కోసం జరుగుతున్న నిరాహార దీక్షలో పాల్గొని ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని జానయ్య యాదవ్ కోరారు. అయితే సూర్యాపేట ప్రజల ప్రధాన సమస్యగా ఉన్న ఈ అంశంపై ఆయనకు ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజల ఆకాంక్ష కోసం జరుగుతున్న ఉద్యమంలో ఎమ్మెల్యే ప్రత్యక్షంగా పాల్గొని తన చిత్తశుద్ధిని చాటుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుంభం నాగరాజు, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమానికి అన్ని విధాలా సహకరిస్తాం

**-తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి**



భానుపురి /సూర్యాపేట ప్రతినిధి

విద్యార్థుల సంక్షేమానికి అన్ని విధాలా సహకరిస్తామని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన నివాసంలో కేజీబీవీ చివ్వేంల పాఠశాలకు రూ.30 వేల విలువైన మోటార్‌ను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని అన్నారు. పాఠశాల అవసరాలను తన దృష్టికి తీసుకువస్తే సాధ్యమైన మేరకు సహకారం అందిస్తానని తెలిపారు. త్వరలో పాఠశాలలోని ల్యాబ్‌లకు అవసరమైన మెటీరియల్‌ను కూడా అందిస్తానని హామీ ఇచ్చారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని కోరారు. విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపడితే వారు విద్యలో మరింత రాణించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యాభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి సి డి ఓ పులన్, కాంగ్రెస్ నాయకులు పిల్లల రమేష్ నాయుడు, గోపాల్ రెడ్డి, అరవింద్ రెడ్డి, యాట ఉపేందర్, తండు శ్రీనివాస్, మర్ల కరుణాకర్ రెడ్డి, ధర్మానాయక్, పాఠశాల స్టాప్ జి దుర్గా డి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సంతోషిమాత అమ్మవారి జన్మదిన వేడుకకు రండి



భానుపురి /సూర్యాపేట టౌన్

ఈ నెల 28 శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో నిర్వహించనున్న శ్రీ సంతోషిమాత అమ్మవారి జన్మదిన వేడుకల( రాఖీ పౌర్ణమి) కు హాజరుకావాలని కోరుతూ శ్రీ సంతోషిమాత దేవాలయ కమిటీ సభ్యులు బుధవారం రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిని కోరారు.

ఈ సందర్భంగా దేవాలయ అధ్యక్షులు బ్రాహ్మణపల్లి మురళీధర్ మాట్లాడుతూ గత 31 సంవత్సరాలుగా శ్రీ సంతోషి మాత దేవాలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవాలయంలో జరిగే రాఖీ ఉత్సవంలో పాల్గొనాలని కోరుతూ మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతోషిమాత దేవాలయం ప్రధాన కార్యదర్శి పబ్బ ప్రకాష్ రావు ఉపాధ్యక్షులు బెలిదే అశోక్, కమిటీ సభ్యులు బ్రాహ్మణపల్లి బాలచంద్రుడు గోపారపు రాజు, చింత వెంకన్న, దేవరశెట్టి నాగరాజు దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై నిత్యం అందుబాటులో ఉంటాం



భానుపురి /సూర్యాపేట టౌన్

ప్రజా సమస్యలపై నిత్యం అందుబాటులో ఉంటామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి ప్రశ్నించారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 36వ, 2వ వార్డుల్లో రూ.5 లక్షల సీసీ డ్రెయిన్ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట పట్టణానికి తాగునీరు అందించే విషయంలో ప్రత్యామ్నాయ నీటి వనరులను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మిషన్ భగీరథ నీటిపైనే అధికంగా ఆధారపడటం వల్ల మోటార్లు, యంత్రాలు సాంకేతిక సమస్యలకు గురైనప్పుడు తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఒకే నీటి వనరుపై ఆధారపడకుండా పలు ప్రత్యామ్నాయ వనరులను సిద్ధంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. జోసెఫ్‌పార్ట్ నుంచి సుమారు 13 మిలియన్ లీటర్ల నీటి సామర్థ్యం ఉన్న ప్లాంట్ ఉన్నప్పటికీ, అవసరమైన స్థాయిలో నీటి లభ్యత లేదన్నారు. పాలేరు నుంచి నీటిని తీసుకురావడంతో పాటు, ఇమాంపేట సమీపంలోని మిషన్ భగీరథ మార్గం ద్వారా మరో పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నామని చెప్పారు. అలాగే మూసీ నుంచి నీటిని తీసుకునేందుకు గతంలో ఉన్న సుమారు 10 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన పాత ఫిల్టర్ ప్లాంట్‌ను కూడా వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.ఇటీవల ప్రజారోగ్య శాఖ ఉన్నతాధికారులు సూర్యాపేటకు వచ్చిన సందర్భంగా ప్రత్యామ్నాయ నీటి వనరులు, 200 బార్ పైప్‌లైన్, పాలేరు నీటి వనరులను వారికి చూపించినట్లు తెలిపారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.తాగునీటి సమస్యకు వెంటనే పరిష్కారం చూపుతామని చెప్పలేమని, ఇది పెద్ద బడ్జెట్‌తో కూడుకున్న అంశమని అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సూర్యాపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసే బాధ్యతను తాము తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, 36వ వార్డు కౌన్సిలర్ మాన్సూర్ బీ ఫారుక్, 2వ వార్డు కౌన్సిలర్ బానోతు సైదులు, తదితరులు పాల్గొన్నారు

# మహా ధర్నాను విజయవంతం చేయాలి

భానుపురి /సూర్యాపేట టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు ఉపాధ్యాయులు రావలసిన బకాయిలపై నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని టాప్రా జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నే యాదగిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావలసిన పెన్షన్, పిఆర్సి, డిఏ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, హెల్త్ కార్డ్స్, సిపిఎస్ రద్దుచేసి ఓ పి ఎస్ అమలు చేయాలని, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మహాధర్న నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురువారం నిర్వహించే మహా ధర్నాకు విశ్రాంత ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మల్లు వెంకట్రామిరెడ్డి, ఏన్ వి సత్యనారాయణ, పి శేఖర్, ఆర్ కృష్ణయ్య, కరుణాకర్, వెంకటాచారి, మల్లారెడ్డి, ఆర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు యాదవ యువసేన అండ



భానుపురి /కేతేపల్లి

ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న కేతేపల్లి గ్రామానికి చెందిన యాదవ యువసేన యువత అభినందనీయమైన సేవా స్ఫూర్తిని చాటుకుంటున్నారు. కేతేపల్లి గ్రామానికి చెందిన జటంగి వీరయ్య (40) తండ్రి బిక్షమయ్య. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి అండగా నిలిచిన యాదవ యువసేన సభ్యులు, వీరయ్య దశదిన కార్యక్రమాల్లో భాగంగా యాదవ యువసేన తరఫున రూ.70 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా రవి యాదవ్ తన వంతుగా రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా యాదవ యువసేన అధ్యక్షుడు ఉప్పల వెంకన్న మాట్లాడుతూ.2010 సంవత్సరం నుంచి యాదవ యువకుల సహకారంతో నిరుపేద కుటుంబాలకు తమ వంతు ఆర్థిక సహాయం అందిస్తూ వస్తున్నామని తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబానికి మనకు చేతనైనంత సహాయం చేయడం ద్వారా వారికి కొంత ధైర్యం కల్పించవచ్చని అన్నారు. యాదవ యువసేన ఉపాధ్యక్షుడు దుబాని లక్ష్మణ్ మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి యువకుడు తన బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. సేవ చేయడానికి సంపద కంటే మంచి మనసు ముఖ్యమని, యువతలో సేవాభావం పెంపొందితే సమాజంలో మరింత మంచి మార్పు సాధ్యమవుతుందని అన్నారు. భవిష్యత్తులోనూ నిరుపేదలు, ఆపదలో ఉన్న కుటుంబాలకు తమ వంతు సహకారం అందిస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో యాదవ యువసేన కమిటీ సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మదర్ తెరిసా స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు






భానుపురి/సూర్యాపేట టౌన్

ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూర్యాపేట నందు భారత రత్న సేయింట్ మదర్ థెరిసా స్ఫూర్తితో బేతెస్థ ఆధారము (ఫౌండేషన్ ) చైర్మన్ దుర్గం కరుణ శ్రీ రోగులకు బ్రేడ్, అరటి పండ్లను పంపిణి చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనాధలకు, వ్యాధి, గ్రస్థులకు మదర్ థెరిసా జన్మదినం రోజే ప్రతి సంవత్సరం చేయడం నాకు చాలా ఆనందం గా వున్నదని, ఆమె స్ఫూర్తితో ఎన్నో మంచి కార్యక్రమాలు భవిష్యత్తులో తలపెట్టనున్నామని ప్రధాన కార్యదర్శి మీసాల సైదులు అన్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ మథర్ థెరిస్సా సోషల్ ఆర్గనైజేషన్ ( ఏఐ ఎఫ్ యంటి యస్ఓ ) రాష్ట్ర కో - చెర్మెన్ బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ మదర్ తెరిసా 1970 నాటికి మానవతా వాదిగా, పేద ప్రజల, నిస్సహాయుల అనుకూలురాలిగా అంతరా_జతీయ కీర్తి పొందిందనీ తన మానవ సేవకు గాను 1962లో పద్మశ్రీ పురస్కారమ, 1979లో నోబెల్ శాంతి పురస్కారాన్ని, 1980లో భారతదేశ అత్యున్నత పౌరపురస్కారమైన భారతరత్నను పొందిందనీ ప్రపంచం వ్యాప్తంగా ఇంకా ఎన్నో అవార్డ్స్ పొందు కున్నారని మదర్ థెరీసా మిషనరీస్ ఆఫ్ ఛారిటీ విస్తృతమై, ఆమె మరణించే నాటికి 123 దేశాలలో 610 సంఘాలను కలిగి, హెచ్ఐవి/ఎయిడ్స్ కుష్టు, క్షయ వ్యాధిగ్రస్తులకు ధర్మశాలలను,గృహాలను, ఆహార కేంద్రాలను, బాలల, కుటుంబ సలహా కార్యక్రమాలను, అనాథ శరణాలయాలను, పాఠశాలలను స్థాపించిందనీ అనేక మంది వ్యక్తులచే, ప్రభుత్వాలచే, సంస్థలచే ప్రశంసింపబడిందని కొనియాడారు. సహకరించిన హాస్పిటల్ సూపర్ డెంట్ డా .పోరిక శ్రవణ్ కుమార్, డాక్టర్లకు నర్సులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ సూపర్ డెంట్ డా. చంద్రశేఖర్, డా. ఐ. కామేశ్వర్, బైరు వెంకన్న గౌడ్, చార్లెట్ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ జాటోత్ డేవిడ్ రాజు, జాతీయ అవార్డు గ్రహీత దయానంద్ ,దుర్గం అంజి, బచ్చలకూరి విక్రమ్, సుధాకర్, పేతురు, అబ్రాహాము తదితరులు పాల్గొన్నారు.

# విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా రక్షా బంధన్ వేడుకలు



భానుపురి సూర్యాపేట టౌన్

సూర్యాపేట జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ,బజరంగ్‌దళ్, మాతృశక్తి విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో పవిత్ర రాఖీ పండుగను పురస్కరించుకుని రక్షా బంధన్ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పేలా ఈ కార్యక్రమం కొనసాగించారు. సమాజ రక్షణే ధ్యేయంగా దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో శ్రమిస్తున్న సైనికులకు, అలాగే సమాజంలో శాంతి భద్రతలనుపరిరక్షించే పోలీసులకు విహెచ్‌పి కార్యకర్తలు, మాతృ శక్తి ప్రతినిధులు రాఖీలు కట్టి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా విహెచ్‌పి జిల్లా ప్రముఖులు మాట్లాడుతూ రక్షా బంధన్ కేవలం రక్ష సూత్రం మాత్రమే కాదు, అది బాధ్యతకు, సత్సంప్రదాయాలకు ప్రతీక అన్నారు.సమాజంలో మహిళలకు రక్షణ కల్పించడం, మన సంస్కృతిని కాపాడు కోవడం ప్రతి ఒక్కరి ప్రథమ కర్తవ్యం కావాలి" అని పిలుపునిచ్చారు. సూర్యాపేట పట్టణంలోని పలు ప్రముఖ ప్రదేశాలలో, దేవాలయాలవద్ద ఈ వేడుకలను నిర్వహించి ప్రజలకు రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమ అంతటా 'భారత్ మాతా కీ జై', 'వందేమాతరం' నినాదాలతో సూర్యాపేట మార్మోగింది. హిందూ సమాజం లో ఐక్యతను పెంపొందించడానికి, పరస్పర సోదరభావాన్ని చాటిచెప్పడానికి ఈ వేడుకలు వేదికగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు కారింగుల ఉపేందర్ జిల్లా సహా కార్యదర్శులు బైరు విజయకృష్ణగౌ రక్ష విభాగం చింత వెంకన్న కోన అండాళ్ మున్నా వెంకన్న , చంద్రావతి బజరంగ్ దళ్ పట్టణ సంయోజక్ పున్నం సందీప్ విశ్వహిందూ పరిషత్ జిల్లా రౌతు కావ్య పలాస సైదులు మహంకాళి సోమయ్య పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా మున్సిపల్ కౌన్సిలర్ గుణగంటి హేమ జన్మదిన వేడుకలు



భానుపురి సూర్యాపేట టౌన్

సూర్యాపేట పట్టణంలోని విద్యానగర్‌లో 44వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ గుణగంటి హేమ సతీష్ జన్మదిన వేడుకలు బుధవారం వారి నివాసంలో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది హాజరై, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.